



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

అవగాహన లేకుంటే..

ఖాతా ఖాళీ..!

- పెరుగుతున్న సైబర్ నేరాలు
- అప్రమత్తతే కీలకమంటున్న పోలీసులు

కొన్ని విషయాల్లో అవగాహన లేకుంటే బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతుంది. సైబర్ నేరగాళ్లు కొంత మార్గాల్లో వల వేస్తున్నారు. అలాంటి సమయంలో అప్రమత్తతే కీలకమని అధికారులు సూచిస్తున్నారు..



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సైబర్ నేరాలు సమాజంలో వేగంగా విస్తరిస్తూ విపత్తుగా మారాయి. సాంకేతికత అభివృద్ధితో పాటు, సైబర్ నేరగాళ్లు కూడా తమ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. డేటా దొంగిలించడం, మోసపూరిత ఫోన్ కాల్స్, ఇమెయిల్ మోసాలు, సోషల్ మీడియాలో మోసాలు, బ్యాంకింగ్ డేటా దొంగిలించడం, ఆన్లైన్ షాపింగ్ మోసాలు, ఫేక్ సైట్లు, సోషల్ మీడియాలో భయపెట్టే సందేశాలు పంపడం వంటి నేరాలు చాలా మందిని వలలో వేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఓటిపిలను చెప్పడం, అవగాహన లేకుండా క్లిక్ చేసే లింక్స్, మీ వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి చర్యలు సైబర్ నేరగాళ్లకు సహకరిస్తాయి. అందువల్ల ప్రజలు తమ డేటాను సురక్షితంగా ఉంచుకోవడం, మోసపూరిత మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకుండా ఉండడం, ఆన్లైన్ లావాదేవీల్లో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. ఇతర క్రైమ్‌లతో పోలిస్తే సైబర్ క్రైమ్ నేరాలు ప్రతి ఏటా 12 శాతం పెరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022 నుంచి 2024 అక్టోబర్ వరకూ 175 సైబర్ కేసులు నమోదయ్యాయి. సుమారు రూ.16.95 కోట్ల సొమ్మును బాధితులు పోగొట్టుకున్నారు. తక్కువ డబ్బుకు ఎక్కువ మొత్తం వస్తుందనే ఆశ చూపి డబ్బులు కడితే ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి పలు దఫాలుగా ఎక్కువ నగదు తీసుకోవడం, పార్ట్ టైం ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూపలలో మెసేజ్‌లు పంపించడం, ఇలా చాలా రకాలుగా సైబర్ మోసాలకు లోనవుతున్నారు. బ్యాంకు లావాదేవీలపై నేరాలు, స్కాన్ ఉపయోగించి లావాదేవీలు ద్వారా కూడా మోసాలు జరుగుతున్నాయి. టెలిగ్రామ్ మెసేజింగ్, వాట్సాప్ మెసేజింగ్, వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లు, పేమెంట్ గేట్‌వేలు, కంపెనీలు, బ్యాంక్ ఖాతాలు, క్రిప్టోకరెన్సీ మొదలైనవి ఉపయోగిస్తున్నారు. ప్రలోభ పెట్టే లింక్‌లు ట్విట్టర్ ఎకౌంటులకు పంపడం, ఆ లింక్ ద్వారా వాట్సాప్ బిజినెస్ అకౌంటులో జాయిన్ అయి తద్వారా బెట్టింగ్‌కు సంబంధించి యాప్లలో జాయిన్ అయ్యి, మోసపూరితమైన మాటలతో డిజిటల్ రూపంలో డబ్బు ఆ వ్యక్తి ఖాతాలో జమ అవుతున్నట్లు నమ్మకం కల్గిస్తూ ఆ యాప్‌లో గెలిచిన డబ్బులు ఉన్నట్టు చూపించి దాన్ని విత్ డ్రా చేసుకోవాలంటే కొంత డబ్బులు జమ చెయ్యాలని చెప్పి, అలా డబ్బులు వేసిన తర్వాత అది నిర్ణీత సమయంలోపు వెయ్యలేదని, దానికి ఫైన్ కట్టాలని మళ్లీ డబ్బులు వేయమని చెప్పి ఆశపెట్టి పలు సార్లు డబ్బులు వేయించుకొని ఇలా బాధితుడిని పలు మార్గాలలో ప్రలోభ పెట్టి లక్షల రూపాయల డబ్బును వివిధ రకాల పేమెంట్ విధానాలలో సైబర్ నేరగాడు తన ఖాతాలకు బదలాయించుకొని మోసానికి పాల్పడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొంత మంది బాధితులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి ఇంటిలోనే ఉంటూ లక్షలు సంపాదించవచ్చునని నగదు పోగొట్టుకున్నారు. యువత బెట్టింగ్‌కి బానిస అయ్యి, డబ్బులు పోగొట్టుకొని చివరికి ఆత్మహత్య వరకు వెళ్తున్నారు. విద్యార్థులు, ఉన్నత చదువులు చదివి కూడా ఇలాంటి బెట్టింగ్ కు పాల్పడి పోలీస్ రికార్డులలో నమోదు కావడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో పాటు, పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపైన పోలీసులు ఛార్జ్‌షీట్ ఓపెన్ చేస్తున్నారు. ఇటువంటి సామాజిక రుగ్మతలకు యువత దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, వారి అలవాట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దు

ఒకే ఒక్క క్లిక్ మీ డేటాను అపహరిస్తుంది. ఇ-మెయిల్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియాలో వచ్చిన అనుమానాస్పద లింకును క్లిక్ చేయకండి. మీపర్సనల్ డేటాను దొంగిలిస్తారు. మీ పాస్‌వర్డును భద్రంగా ఉంచుకోండి. వాటిని ఎవరితోనూ పంచుకోవద్దు. ఎప్పటికప్పుడు మీ పాస్వర్డును మారుస్తూ ఉండాలి. యువత పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్లు, ఇంటర్నెట్, మెసేజింగ్ ప్లాట్ ఫామ్లు మొదలైన ఇతర ప్రకటనలకు ఆకర్షితులవుతుంటారు. వారి ఆశను అవకాశంగా తీసుకొని తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు అవుతుందని అధిక జీతం లేదా కమీషన్లు లేదా అధిక రాబడి వస్తుందని వాగ్దానం చేస్తారు. ప్రకటనలు, ఎస్ఎంఎస్‌ల ద్వారా సాధారణంగా ఒక లింక్ ఉంటుంది. ఇది నేరుగా టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులో చేరమని వారిని అడుగుతారు. పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట విదేశీ నెంబర్ల నుండి వచ్చే మోసపూరిత వాట్సప్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

మోసపోతే ఇలా చేయండి..

సైబర్ నేరగాల వల్ల మోసపోయినట్లు గుర్తిస్తే బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌ను ఎంచుకుని ఫిర్యాదు చేయవచ్చు. అందులో మోసపోయిన వివరాలు, డబ్బు కట్ అయిన ఖాతా వివరాలు, నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సమర్పించాలి. లేదా సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

అన్ని పంటలకూ

గిట్టుబాటు ధరలు కల్పించాలి

- అన్నదాత సుఖీ భవ క్రింద రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలి
- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఢిల్లీలో మద్దతు ధరల చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతుల పైన ఢిల్లీ, పంజాబు ప్రభుత్వాలు దాడి చేసి రైతు శిబిరాలను కూల్చాయన్నారు. మద్దతు ధరల చట్టము రైతుల రుణమాఫీ సమగ్ర పంటల బీమా రైతు ఉద్యమంలో మరణించిన వారి రైతు స్మారక స్థూపాలు నిర్మించాలని ఢిల్లీలో రైతులు ఆందోళన చేస్తున్నారన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తూ మరోపక్క మూడు వేల మంది పోలీసులను ఉపయోగించి జెసిబిలతో రైతు ఆందోళన శిబిరాలను కూల్చివేసిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.20,000 అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సహాయం చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మాటే మరిచిందన్నారు. గత సంవత్సరం తుఫాను వరదల కారణంగా నష్టపోయిన రైతులకు జిల్లాల్లో ఎలాంటి సహాయం అందలేదని, పంటల భీమా కూడా ఇవ్వలేకపోయారన్నారు. ప్రస్తుతం జిల్లాలో పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర లేక రైతులు విలవిలలాడుతున్నారని ప్రభుత్వం జోక్యం చేసుకొని భరోసా ఇవ్వాలన్నారు. వివిధ ప్రాజెక్టుల క్రింద భూసేకరణ చేసిన రైతులకున్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, కోటకొండ సూరి ,వనజ, హనుమంతు, కృష్ణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో వివిధ మండలాల నుండి హాజరైన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు పూడిచెర్లలో డిప్యూటీ సిఎం పర్యటన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం ఓర్వకల్ మండలంలోని పూడిచెర్ల గ్రామంలో శనివారం పర్యటించనున్నారు. ఉదయం గన్నవరం విమానాశ్రయం నుండి నేరుగా ఓర్వకల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. రోడ్డు మార్గంలో ఓర్వకల్లు విమానాశ్రయం నుండి పూడిచెర్ల గ్రామానికి చేరుకుని అక్కడ ఫారం పాండ్ పనులకు భూమి పూజ చేసిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నాం జిల్లా పర్యటన ముగించుకొని నేరుగా ఓర్వకల్లు విమానాశ్రయం నుండి హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు.

నెలాఖరులోగా మినీ గోకులాలు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న మిని గోకులాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డిప్యూటీ సీఎం కు వివరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1200 లక్ష్యానికి గాను 664 పూర్తి చేశామన్నారు. పెండింగులో ఉన్న వాటిని కూడా 15 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి కర్నూలు జిల్లా 119.70 కిలోమీటర్లకు గాను, 116.72 కిలోమీటర్లు పూర్తి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ డిప్యూటీ సిఎంకు వివరించారు. సిసిరోడ్ల నిర్మాణాలకు సంబంధించి పురోగతి బాగా సాధించడంతో డిప్యూటీ సీఎం కర్నూలు కలెక్టర్‌ను అభినందించారు. 70 సంవత్సరాల తర్వాత కూడా రోడ్డు లేని గ్రామాలు జిల్లాలో 21 ఉన్నాయని, అందులో రూ.17 కోట్లతో 11 గ్రామాల్లో రోడ్ల పనులు మొదలు పెట్టామని, పెండిండులో ఉన్న 10 గ్రామాల్లో కూడా రోడ్ల పనులు ఏప్రిల్ నాటికి మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓర్వకల్లు మండలం, పుడిచర్ల గ్రామానికి ఫార్మ్‌ఫండ్ భూమి పూజ కార్యక్రమం అనంతరం ఫార్మ్ ఫండ్ ఉపయోగాలు తెలియచేసే విధంగా రెండు రకాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ డైరెక్టర్ షణ్ముఖ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డ్వామా పిడి వెంకటరమణయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఆసరా ఇవ్వని ఉపాధి

- పెండింగ్‌లో ఉపాధి కూలీ వేతనాలు
- ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- నేడు ఓర్వకల్లుకు డిప్యూటీ సిఎం రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం నిరుపేదలకు మాత్రం ఆసరా కల్పించడం లేదు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు 10 వారాలుగా వేతనాలు అందని పరిస్థితి ఉంది. పని ప్రదేశాల్లో కూడా కూలీలకు సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే కల్పిస్తున్నారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని పూడిచర్ల గ్రామంలో ఫారం పాండ్ నిర్మాణ పనుల ప్రారంభానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నారు. కర్నూలు జిల్లాలో 3.23 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో దాదాపుగా 6.13 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. ప్రస్తుతం ఉపాధి పనులకు దాదాపుగా సగటున రూ.70 వేల మంది పైగా కూలీలు పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ కింద చేసిన పనులకు కూలీల డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాలకే జమ చేస్తారు. ఇప్పటివరకు జిల్లాలో 9 వారాలైనా ఉపాధి కూలీల వేతనాలు విడుదలకు నోచుకోని పరిస్థితి ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు ప్రతి ఏడాది వలస వెళ్తారు. వ్యవసాయ కూలీలు గ్రామాల్లో పనులు ఉండకపోవడంతో సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే వలస బాట పడతారు. గ్రామాల్లో పనులు చేసిన వాటికి వేతనాలు చెల్లింపుకు రెండు మూడు వారాలు వేచి చూసిన విడుదల కాకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించాలని అధికారులను వ్యవసాయ కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి కూలీలకు గతంలో పని ప్రదేశాల్లో నీడ తాగునీటి లాంటి సౌకర్యాలను కల్పించేవారు. ఇప్పుడు అలాంటి సౌకర్యాలను ఉపాధి కూలీలకు ఎక్కడా కల్పించడం లేదు. మరోపక్క ఎండల తీవ్రత కూడా రోజురోజుకు పెరుగుతుంది. ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు వెంటనే కూలీ వేతనాలను విడుదల చేయడమే కాకుండా సమ్మర్ అలవెన్స్ ఇతర సౌకర్యాలను కల్పించాలని వారు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు నిరుపేదలు విన్నవించుకుంటున్నారు.



ఓర్వకల్లులో భిక్షాటన చేపడుతున్న ఉపాధి కూలీలు,నాయకులు, కూలీలు

కూలీ డబ్బులు త్వరగా ఇవ్వాలి

- కెవి.నారాయణ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధి హామీ పథకం కింద కూలీలు చేసిన పనులకు సంబంధించిన డబ్బులు త్వరగా విడుదల చేయాలి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత శాఖ అయిన గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ కావడంతో ఉపాధి కూలీలకు మరింత న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ ఎక్కడ జరగడం లేదు. ఇప్పటివరకు గత పది వారాలుగా ఉపాధి కూలీలు చేసిన పనులకు వేతనాలు విడుదల కాకపోవడం బాధాకరం. ఉపాధి వేతనాలు వెంటనే విడుదల చేసి కూలీల పని ప్రదేశాల్లో నీడ తాగునీటి వసతి సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి.

రైతు ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం దుర్మార్గం

- కర్నూలులో ఎపి రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతుల ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం దుర్మార్గమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ విమర్శించారు. రైతుల ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వ ధమనకాండకు నిరసనగా శుక్రవారం కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్ నుండి సుందరయ్య జంక్షన్ దాకా రైతులు ప్రదర్శనగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలి, రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి. ఢిల్లీ సరహద్దులో శాంతి యుత ఆందోళనకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.' అని నిదాలు చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి జి.రామకృష్ణ మాట్లాడారు. గతంలో ఏడాది పాటు ధర్నా చేసిన రైతులను వివిధ రూపాల్లో ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య ,నాయకులు హనుమంతు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.



నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

చైతన్యం నింపేందుకే 'వికసిత్ భారత్'

నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి రాహుల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

భారత దేశాన్ని అగ్రపథాన నిలుపడంలో భాగంగా దేశ యువతలో చైతన్యం నింపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి జి రాహుల్ రెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి యూత్ పార్లమెంటరీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.శాంత మాట్లాడుతూ 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచంలో అగ్రగామి దేశంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో ముందు వరసలో ఉంచాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆరంభించారని అన్నారు. జాతీయ యువజన సాధికారత క్రీడల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ న్యూ ఢిల్లీ వారు ఉమ్మడి కర్నూలు - నంద్యాల జిల్లాల్లో జిల్లా స్థాయి యూత్ పార్లమెంటరీ పోటీలను నిర్వహించేందుకు తమ కళాశాలను ఎంపిక చేయడం సంతోషంగా వుందన్నారు. ఇందులో 150 మంది పాల్గొన్నారని, వారిలో ప్రతిభ చూపిన పది మందిని ఎంపిక చేసి రాష్ట్ర అసెంబ్లీ, దేశ పార్లమెంట్లో మాట్లాడే అవకాశం కల్పిస్తారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అడ్మినిస్ట్రేషన్ వై శౌరీలు రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సివి సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భాను ప్రసాద్, భౌతిక శాస్త్ర విభాగాధి పతి డాక్టర్ కెఎస్ఆర్ చంద్ర శేఖర్, కళాశాల ఎన్ఎస్-ఎస్ ప్రో గ్రాం అధికారులు డి వేంక టేశ్వర్లు, ఎ.మల్లికార్జున, ఎస్.స్వాతి కల్యాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి రాహుల్ రెడ్డి

విద్యుత్ బస్సుల ముసుగులో ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ బస్సులు కొనుగోలు చేస్తూ విద్యుత్తు బస్సులో ముసుగులో ఆర్‌టిసి ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఈ విధానాన్ని మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను కెకె.భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. విద్యుత్ బస్సులు వాడకం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు అని చెబుతున్నారని కాలుష్యము వాహనాల కంటే అధికంగా పారిశ్రామిక కేంద్రాల ద్వారా వస్తుందని తెలిపారు. వస్తున్న పర్యావరణ కాలుష్యం 50శాతం పారిశ్రామిక కేంద్రాల వల్లే వస్తుందని తెలిపారు. వాహనాల వల్ల కేవలం 15 శాతం మాత్రమే వస్తుందని అన్నారు. విద్యుత్ బస్సులు కొనుగోలు చేయడం ద్వారా ప్రజాధనం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళుతుందని విద్యుత్ బస్సులో కొనుగోలు కొరకు ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున రాయితీలను ఇవ్వబోతుందని తెలిపారు. విద్యుత్ బస్సులు నిర్వహణ కూడా ఆర్‌టిసి ద్వారా కొనసాగిస్తే రవాణా సంస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఒక విద్యుత్ బస్సు కొనుగోలు చేసే డబ్బులతో ఎనిమిది పల్లె వెలుగు బస్సులను కొనుగోలు చేయొచ్చని దీనివల్ల ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 24న ఢిల్లీలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో రవాణా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌డబ్ల్యూఎస్ రీజినల్ కార్యదర్శి వివిఎస్. రాయుడు, రీజినల్ నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్స్‌ను విడుదల చేస్తున్న దివాకర్, అంజిబాబు,ఆంజనేయులు

వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వీధికుక్కల నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు నగరపాలక సంస్థ అధికారులను డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా వార్డు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.నరసింహులు , వార్డ్ కమిటీ సభ్యులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ నగర్ లో వీధికుక్కల వలన చాలాప్రమాదాలుజరుగుతున్నాయని , ఏ సందుకు వెళ్లినా 10 నుంచి 15 కుక్కల వరకు ఉంటున్నాయని, చిన్నపిల్లలు, ముసలివాళ్లుబయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా కుక్కలుమీద పడి కొరకడం వలన గాయాలపాలై హాస్పటల్లో చుట్టూ తిరుగుతున్నారు. బైకు మీద వెళ్లే వాళ్లను కూడా కుక్కలు వెంబడించి కింద పడేసి కాలు చేతులు విరిగిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇండ్ల ముందుబైకులు పెట్టుకుంటే రాత్రి వేళల్లో వీధి కుక్కలు బైకు సీట్లను కొరికి పాడు చేస్తున్నాయి. కుక్కలుమొత్తం చింపి నాశనం చేస్తున్నాయి. వీధి కుక్కలను పట్టుకు వెళ్లండి అని స్థానిక కార్పొరేటర్‌కు, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పినా పట్టించుకోవడంలేదని సిపిఎం బృందానికి తమ గోడును వినిపించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. నరసింహులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులుకు ప్రజలపై పన్నుల భారాలువేసే దానిపైన ఉన్నటువంటి శ్రద్ధ ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రజలు ఇంటి పన్ను, కొళాయి పన్ను కట్టకపోతే ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తారన్నారు. పన్ను లేటుగా కడితే రెండు రూపాయలు వడ్డీతోవసూలుచేస్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ లేదన్నారు. వీధి కుక్కలు ఏ సందులో చూసినా పదుల సంఖ్యలో ఉంటూ ప్రజల పైన పడికొరుకుతున్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్న, పిల్లలు ముసలి వాళ్లు బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్న, బైకులు, కార్లు ధ్వంసం చేస్తున్నారన్నారు. అని ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నపట్టించుకోకపోవడం చాలా దుర్మార్గం అన్నారు. సిపిఎం వార్డు నాయకులు ఎస్.అజ్మత్, ఆర్.శేషం రాజు, వై.జాన్సన్, ఎన్.నరసింహులు, టి. విజయ్ భాస్కర్ , ఆర్.రాజు, వై. నరసింహులు, ఎం.శ్రీనివాసులు వీధిపెద్దలు జి.చెంచయ్య, వై.సవారన్న, బి.సంజన్న వేణుగోపాల్ రెడ్డి, మహిళలు ఆర్.లక్ష్మీదేవి, ఎం.లక్ష్మిదేవి, సి.నాగలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అమోఘం

ప్రజాశక్తి-గూడూర్

గూడూరులో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ స్కూల్ దగ్గర స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గాడ్స్ విద్యార్థులు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పదో తరగతి రాస్తున్న ఎగ్జామ్ విద్యార్థులకు వారికోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. హెడ్మాస్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల స్థాయి నుంచి సేవలు అందించాలని, 10 తరగతి రాస్తున్న విద్యార్థులు ఎగ్జామ్ ముగించుకొని బయటికి వచ్చిన ప్రతి విద్యార్థి మంచినీళ్లు తాగి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. స్కూల్ హెచ్ఎం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ కన్వీనర్స్ వెంకట్రాముడు , అజ్మతుల్లా ఖాద్రి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

మహిళా చట్టాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాఅధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అధితి న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ చర్యలలో మహిళల హక్కులు హరించినప్పుడు, మహిళలపై దారుణాలు, సమాజంలో మహిళలపై సంఘ వ్యతిరేక చర్యలు జరిగినప్పుడు చర్యలు తీసుకోవడానికి అనుగుణంగా చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. చాప్టర్ 5 మహిళలు , పిల్లలపైబిఎన్ఎస్ నేరాలు, పిఒసిఎస్ఒ చట్టం గురించి, ఎల్ఎడిసిఎస్ తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లల పై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని వివరించారు. 18 సంవత్సరాల లోపు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు. పోక్సో కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలున్నాయని తెలిపారు. ఈ సదస్సులో న్యాయ వాది శివరాం, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కోవడుమూరు కోట్ల సర్కిల్‌లో నిరసను ఉద్దేశించి మాట్లాడుతున్న గురుశేఖర్

ఉపాధి పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ఓర్వకల్ లో ఉపాధి కూలీలు భిక్షాటన , కోడుమూరులో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/కోడుమూరు

తక్షణమే ఉపాధి పెండింగ్ బిల్లులన్ని విడుదల చేసి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో ఉపాధి కూలీల భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించి వినూత్న నిరసన తెలిపారు. బి.నాగన్న, కెవిపిఎస్ మండల నాయకులు రామకృష్ణ, శివకుమార్ ఉపాధి కూలీలు కలిసి ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని భిక్షాటన కార్యక్రమం చేపట్టారు.

కోడుమూరు: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం మండల నాయకులు గఫూర్‌మియ్యా అధ్యక్షతన కోడుమూరు కోట్ల సర్కిల్‌లో ఉపాధి కూలీలతో నిరసన తెలిపారు.చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురు శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.


పరీక్ష రాసిన వలస విద్యార్థి
- విద్యార్థినికి డిఇఓ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోసిగి

వలస వెళ్లిన విద్యార్థి శుక్రవారం పదో తరగతి పరీక్ష రాశారు. డిఇఓ ఎస్.శామ్యూల్ పాల్ శుక్రవారం కోసిగిలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని పరీక్ష అనంతరం మౌంట్ కార్మెల్ పాఠశాలకు వెళ్లి పలుకరించారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున, గత్యంతరం లేని స్థితిలో రూ.450కు దినసరి కూలీగా తల్లిదండ్రులతో పాటు గుంటూరు మిరపకాయల పనికి వెళ్లారని స్నేహితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో చిన్నారి పరీక్షలు రాసేలా ప్రయాణ ఏర్పాట్లు చేశారు. విద్యార్థిని డిఇఓ మాట్లాడుతూ... గత పరీక్షల్లో తనకు మెరుగైన మార్కులు వచ్చాయని, ప్రస్తుత పరీక్షలో కూడా 80 మార్కులు వస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గ్రేడ్యుయేషన్ సబ్జెక్టులను సప్లిమెంటరీ పరీక్షల్లో బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకుంటానని చెప్పారు. కష్టించి ఉత్తీర్ణత సాధించి, ఇంటర్మీడియట్ బైపిసి చదువుతానని చెప్పడంతో డిఇఓ ప్రత్యేకంగా అభినందించారు. స్పందించిన డిఇఓ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ధైర్యం చెప్పి, పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్ విద్యకు కస్తూరిబా కళాశాలలో చేర్పించి చదివిస్తామని, ఆర్థికంగా ఆదుకుంటామని డిఇఓ హామీ ఇచ్చారు. విద్యార్థిని పదో తరగతి పరీక్షలను వదిలేసి గుంటూరు వలస వెళ్లిన సంగతి తెలిసిందే. చిన్నారి పరీక్షలు రాసేలా గుంటూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకొని స్వగ్రామానికి రప్పించారు. చిన్నారి పరీక్షలకు హాజరయ్యేలా డిఇఓ ఏర్పాట్లు చేశారు.


విద్యార్థినితో మాట్లాడుతున్న డిఇఓ

అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలి
- ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం నాయకులు



ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్సీ కాలనీ, మైనార్టీ కాలనీ, చాకలిపేట మధ్యలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, ఎస్సీ కాలనీ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా ఎస్సీ కాలనీలో రోడ్లు వేయకపోవడం దారుణమని తెలిపారు. ఆర్‌సిఎం చర్చి నుంచి పెద్ద కమేలి వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని, ఆర్‌సిఎం చర్చి నుంచి కబరస్థాన్ గేటు వరకు రోడ్డు గుంతలమయంగా ఉందని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణ విషయంలో మున్సిపాలిటీ, ఆర్అండ్‌బి అధికారులు ఒకరిపైఒకరు నెట్టుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. బాబు జగ్జీవన్ రావు కాలనీ చివరలో రోడ్డు వేయాలని, దళితులు, మైనార్టీలు, పేదలు నివసించే ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ నాయకులు పులి రాజు, రాముడు, రమేష్, సుభాన్, పరమేష్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. క్రమశిక్షణ, సామాజిక సేవలను పెంపొందించేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు రమణమూర్తి తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవ పట్ల ఆకర్షితులవ్వాలని చెప్పారు. జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమైన పెద్దహరివాణం పాఠశాలలో ఈ యూనిట్‌ను ప్రారంభించడం హర్షణీయమన్నారు. స్కౌట్ మాస్టర్ జి.రామన్న, గైడ్ మాస్టర్ పుష్పలత మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులు దీక్ష, ప్రమాణ స్వీకారం చేయించారు. స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు యూనిఫారం ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు నాగేంద్రుడు, శివరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీర శేఖర్
- వ్యకాస ఆధ్వర్యంలో కూలీల భిక్షాటన

ప్రజాశక్తి - దేవనకొండ

ఎర్రటి ఎండలో చేసిన పనికి కూలీలకు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పది వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు భిక్షాటన చేపట్టారు. వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస నాయకులు బజారి, పరమేష్ మాట్లాడారు. పది వారాలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ పట్ల, పేదల పట్ల ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఒకవైపు వలసలు వెళ్లొద్దని బూటకపు ప్రచారం చేస్తూ మరోవైపు ఉపాధి హామీ పనులను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. దేశంలో కేవలం 4 నెలలు మాత్రమే వ్యవసాయ పనులు ఉంటాయని, తర్వాత గ్రామీణ ప్రాంతాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్తుంటారని తెలిపారు. వలసలు వెళ్లకుండా.. పనులు కల్పించే ఉద్దేశంతో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వేసవి అలవెన్స్‌లు, తాగునీరు, రవాణా అలవెన్స్ ఇచ్చేవారని, టెంట్ల సౌకర్యం కల్పించే వారని చెప్పారు. పెండింగ్ బిల్లు చెల్లించి, 150 రోజుల పని రూ.600 వేతనం, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు, భూమిలేని కూలీలకు భూమి, ఇంటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యకాస నాయకులు రాముడు, వీరేంద్ర, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, వ్యకాస, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, రవీంద్ర, రామాంజనేయులు, మహేష్, రంగడు పాల్గొన్నారు. **ఆదోని**లో అంబేద్కర్ విగ్రహం నుంచి భీమాస్ కూడలి వరకు భిక్షాటన చేపట్టారు. మండలంలో ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో పని చేసిన కూలీలకు రూ.15 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, ఇవ్వకపోతే ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన నిర్వహిస్తామని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు హెచ్చరించారు. నాయకులు లక్ష్మన్న, పాండురంగ, గోపాల్, తిక్కప్ప, తిప్పన్న, గోవిందు, వ్యవసాయ కూలీలు మారెప్ప, ఈరన్న, లింగప్ప, సిద్ధ పాల్గొన్నారు.


దేవనకొండలో భిక్షాటన చేస్తున్న ఉపాధి కూలీలు, నాయకులు



ఆదోనిలో భిక్షాటన చేస్తున్న ఉపాధి కూలీలు, నాయకులు


ఇఫ్తార్ విందు ఇస్తున్న చెన్న బసప్ప


మాట్లాడుతున్న బసప్ప

చెన్న బసప్ప ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు చెన్న బసప్ప ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక జామియా, మదీనా నురాని, మజీద్ -ఎ- అక్స మజీద్‌ల నుంచి ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, చెన్న బసప్ప మాట్లాడుతూ... పవిత్ర మాసమైన రంజాన్‌లో ముస్లియిలు కఠోర ఉపవాసం పాటించి నమాజులు చేస్తారని తెలిపారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో ఉండాలని సూచించారు. టిడిపి నాయకులు భరద్వాజ్ శెట్టి, కురుగోడు, కాశీ విశ్వనాథ్, సిద్ధు, రెహమాన్, సోమన్న, రాజు, రాజబాబు పాల్గొన్నారు.

కవిత్వం సమాజానికి దిక్సూచి
- సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు బసప్ప

ప్రజాశక్తి - ఆదోని

'కవిత్వం' అనేది సమాజానికి దిక్సూచి లాంటిదని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 'నైస్ అకాడమీ'లో ప్రపంచ కవిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉరుకులు పరుగుల జీవితంలో కవిత్వాన్ని ఆస్వాదిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అరసం జిల్లా కార్యదర్శి కెసి.మల్లికార్జున మాట్లాడుతూ... కవత్వమొక తీరని దాహమని తెలిపారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ... సామాజిక స్పృహతో కవిత్వం ఉండాలని పేర్కొన్నారు. మాళేకర్ నాగజ్యోతి, డాక్టర్ నల్లారెడ్డి, రామలక్ష్మి, డాక్టర్ సక్కిరి భాస్కర్ తదితర కవులు తమ కవితలను వినిపించి, సభను అలరింపజేశారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి
- సిడిపిఒ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

పిల్లల సంరక్షణపై బాధ్యతాయుతంగా వ్యవహరించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సిడిపిఒ ఉమామహేశ్వరి తెలిపారు. పిల్లల సంరక్షణపై అంగన్వాడీలకు రెండో రోజూ శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ హై స్కూల్‌లో పోషణ బీ, పడాయి బీ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మూడేళ్లలోపు చిన్నారులకు చేతన కార్యక్రమం ద్వారా వారి ఎదుగుదల, శరీరంలో మార్పుల గురించి తల్లులకు వివరిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు టి.లీలావతి, కె.సావిత్రి, రాగిణి, వసంత, కె.బాష, మహాదేవి, స్వయం ప్రభ, సావిత్రి, పుష్పావతి, సీనియర్ అసిస్టెంట్ శంకరాచారి ఉన్నారు.

పోటాపోటీగా వేలం పాటలు

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. శుక్రవారం డిఎల్‌పిఒ నూర్జహాన్, ఇఒఆర్‌డి హరున్ రషీద్, మేజర్ పంచాయతీ సర్పంచి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి, మండిగిరి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన వేలంపాటలు నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి వారపు సంత రూ.4.55 లక్షలకు రణ తిక్కన్న, (రహదారి రుసుం) బండి మెట్టను పోతుల మధు రూ.27.20 లక్షలకు, చిన్న కమేళాను రూ.33 వేలకు కటికె ఖలందర్, పెద్ద కమేళాను రూ.35 వేలకు మాణిక్ రాజ్ దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈఏడాది రూ.23.72 లక్షలు అధిక ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా సిఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి బందోబస్తు నిర్వహించారు.


వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

తప్పుల్లేకుండా ఓటరు జాబితా
- ఆధార్ అనుసంధానంతోనే జాబితా ప్రక్షాళన
- ఎలక్టోరల్ అధికారిణి అనురాధ

ప్రజాశక్తి - మంత్రాలయం

తప్పుల్లేకుండా ఓటరు జాబితా తయారీకి ప్రతి ఓటరూ సహకరించాలని, ఓటరు కార్డుతో వారి వారి ఆధార్ కార్డు అనుసంధానం చేసినప్పుడే జాబితా ప్రక్షాళన అవుతుందని ఎలక్టోరల్ అధికారిణి కె.అనురాధ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవి అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన యువత ఓటరు నమోదు ఆన్‌లైన్‌లో నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ ఉన్నాయని, మృతి చెందిన వారి పేర్లు తొలగించాలని సూచించారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల ఆధునీకరణతో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయాలనే ప్రతిపాదనను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కోసిగి తహశీల్దార్ రుద్రగౌడ్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు పాల్గొన్నారు.

పాదయాత్రీకులకు రేడియం స్టిక్కర్లు పంపిణీ



ప్రజాశక్తి- దేవనకొండ

ఉగాది నేపథ్యంలో శ్రీశైలానికి పాదయాత్ర చేసే భక్తులకు శుక్రవారం స్థానిక సిఐ వంశీనాథ్ రేడియం స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాత్రిపూట నడిచి వెళ్లేటప్పుడు టార్చి లైట్, బ్యాగులకు రేడియం జాకెట్లు, స్టిక్కర్లు వేసుకోవాలని సూచించారు. రాత్రిపూట ప్రయాణం చాలా ప్రమాదకరమని, వాహనాలను నిలుపరాదని తెలిపారు. ఒంటరిగా ప్రయాణం చేయకుండా గుంపులుగా వెళ్లాలన్నారు.

చంద్రబాబుతోనే మాదిగల అభివృద్ధి, సంక్షేమం : ఐటిడిపి

ప్రజాశక్తి - కోసిగి

మాదిగల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని దళిత నాయకులు, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు, ఎంఆర్‌పిఎస్ మండల మాజీ అధ్యక్షులు కొట్టాల దేవన్న, ఎంపిటిసి రాజు తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో 30 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న తరుణంలో ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో తీర్మానం చేసి మాదిగల వర్గీకరణకు అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, యువ నేత, మంత్రి నారా లోకేష్‌కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, హోమ్‌మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 30 ఏళ్ల నుంచి మాదిగల కోసం పోరాటం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు మాదిగలు రుణపడి ఉంటామన్నారు.

12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

12వ వేతన సవరణ సంఘానికి తక్షణమే ఛైర్మన్‌ను నియమించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న డిమాండ్ చేశారు. శుక్రవారం అప్పారి వెంకట స్వామి వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాజు, సీనియర్ నాయకులు మల్లారి నాగరాజు, నాగరాజు, మాదన్న, మండల నాయకులు చంద్రపాల్, సుధాకర్, లక్ష్మన్న, మంజునాథ్, భాగ్యరాజు, సంజన్న, బాలరాజు పాల్గొన్నారు. **గోనెగండ్ల** బస్టాండ్ పాఠశాలలో మండల కమిటీ ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి చంద్రపాల్ అధ్యక్షత వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మలబాబు మాట్లాడుతూ... బడి కోసం, బకాయి కోసం పోరుబాట చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పారి వెంకటస్వామి విద్యా రంగం కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ప్రస్తుతం ప్రభుత్వం జిఒ 117ను రద్దు చేయాలని ఆపాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు రూ.25 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వాటి సాధనకు ఏప్రిల్ 13న యుటిఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలులో జరిగే బడి కోసం, బకాయిల కోసం పోరుబాట ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. గౌరవాధ్యక్షులు లింగన్న, అక్బర్, కెసి.నాగరాజు, చౌడయ్య, నాగరాజు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు


గోనెగండ్లలో మాట్లాడుతున్న గుమ్మల బాబు

శ్రీశైలానికి తరలివస్తున్న కర్ణాటక భక్తులు

ప్రజాశక్తి - కౌతాళం



జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం కర్ణాటక భక్తులు పాదయాత్ర ద్వారా తరలి వస్తున్నారు. శుక్రవారం ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని కుమ్మాలనూర్ గ్రామం వద్ద తుంగభద్ర నదిని దాటుకుంటూ కర్ణాటక భక్తులు ఆంధ్రలోకి ప్రవేశిస్తున్నారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా కర్ణాటకలోని ధార్వాడ్, బెల్గాం, గదగ్ హుబ్లీ, బాగల్కోట్, గంగావతి, సింధనూర్ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్నారు. ఇలా 4, 5 రోజుల నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కాళ్లకు కట్టెలు కట్టుకొని ప్రతి గ్రామం నుంచి భక్తులు కాలినడకన వస్తున్న తీరు ప్రజలను ఆకట్టుకుంటోంది. సుమారు 500 కిలోమీటర్లు ఇలా నడుచుకుంటూ కన్నడిగులు వస్తున్నారు. ఎండలు భారీగా ఉండడంతో పాదయాత్ర చేస్తున్న భక్తులు అర్ధరాత్రి నుంచి కొనసాగించి మధ్యలో విశ్రాంతి తీసుకుని, మళ్లీ సాయంత్రం నుంచి పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఇలా ఒక రోజుకు సుమారు 40 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు కర్ణాటక భక్తులు తెలిపారు. ప్రతేడా పాదయాత్ర చేసి మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్నట్లు చెప్పారు. భక్తుల కోసం జిల్లాలోని పశ్చిమ ప్రాంత పల్లెల్లో తాగునీటి సౌకర్యం, అల్పాహారాలు, భోజన సౌకర్యాలు కల్పిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. ఫిబ్రవరిలో రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. 30 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించామని, నగదు రూపంలో రూ.3,48,69,621, బంగారం 37 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 1 కిలోల 280 గ్రాములు వచ్చినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు
- ఎపిసిఎన్ఎఫ్ ఏరియా కోఆర్డినేటర్ పద్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా సహజంగా లభించే పశువుల నుంచి వచ్చే ఎరువులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ శాఖ ఏరియా కోఆర్డినేటర్ పద్మ తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామైఖ్య సంఘం సమన్వయంతో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి రైతుల భూముల్లో సారం పెంచేందుకు, పంటల దిగుబడి పెంచేందుకు మండల కోఆర్డినేటర్ పద్మ ప్రయోగం (డెమో) ద్వారా చూపించారు. ఇలాంటి పంటల ద్వారా వచ్చిన ధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటూ తిన్న వారు మంచి ఆరోగ్యంతో ఉంటారని సూచించారు. గ్రామైఖ్య సంఘాల సభ్యులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు కలిసి రావాలని కోరారు. ఎఒ జీరా గణేష్, ఎపిఎం రాజశేఖర్, సిసిలు ఖాజా హుస్సేన్, రామలింగ, మండల గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు కళావతి పాల్గొన్నారు. **దేవనకొండ**లోని వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారులు, పొదుపు సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి బుజ్జీశ్వరుడు, ఎపిఎం నరసన్న, వెలుగు సిసిలు సోమన్న, ప్రభాకర్, మస్తాన్, ముద్దరంగడు, విష్ణు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న పద్మ


దేవనకొండలో...

ఏప్రిల్ 15 వరకు సాగునీరు
- తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి - ఆదోని


పంటలు సాగు చేసిన ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడకుండా ఏప్రిల్ 15 వరకు తుంగభద్ర దిగువ కాలువలో నీటి ప్రవాహం ఉండేలా చూస్తామని ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పి.టిప్పు సుల్తాన్ తెలిపారు. శుక్రవారం తుంగభద్ర దిగువ కాలువపై ఆంధ్ర సరిహద్దు నుంచి చింతకుంట వరకు పర్యటించారు. టిబిపి డిప్యూటీ ఇంజినీర్ మహ్మద్ షఫీవుల్లా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలువ గట్టు కోతకు గురికాకుండా ముళ్ల కంపలు తొలగించాలన్నారు. డిపిల వద్ద షట్టర్లు పటిష్టంగా ఉండేలా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కాలువలో, డ్యాములో నీరు పుష్కలంగా ఉందని, పంటలు సాగు చేసిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. ఏప్రిల్ 15 వరకు సాగునీరు అందిస్తామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా డ్యామ్‌లో ఉన్న వాటా నీటిని అవసరాల నిమిత్తం వాడుకునేందుకు కూడా విడుదల చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, టిబి బోర్డు అధికారులు నవజీవన్ రెడ్డి, విజయ్ కుమార్ ఉన్నారు.


కాలువ పరిస్థితిని తెలుసుకుంటున్న ఛైర్మన్

బదిలీ ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద ఎస్ఐ బాల నరసింహులు బదిలీపై కర్నూలుకు వెళ్లనున్న నేపథ్యంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం ఎస్ఐని పూలమాలలు, శాలువాలతో సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. ఎంఇఒలు టి.సత్యనారాయణ, కె.జగన్నాథం మాట్లాడుతూ... పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికల సమయంలో, మెగా పేరెంట్ మీటింగ్‌లు, పరీక్షల సమయంలో ఎస్ఐ బాల నరసింహులు సహాయ, సహకారాలు అందించారని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు సిద్ధప్ప, పంపాపతి, లక్ష్మప్ప, మల్లయ్య పాల్గొన్నారు.


ఎస్ఐని సన్మానిస్తున్న విద్యాశాఖాధికారులు

నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి - ఆస్పరి

సారా లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే 'నవోదయం 2.0' ప్రధాన ఉద్దేశమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లలితాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని బిల్లేకల్లు, కైరుప్పల, కారుమంచి గ్రామాల్లో పర్యటించి నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ నవీన్ బాబు, కానిస్టేబుల్ రంగముని, విజయ్, సోమేష్, కౌలుట్ల రవి రెడ్డి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న లలితాదేవి

రెండో రోజూ ఛైర్మన్ శాంత దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ ఛైర్మన్ శాంత శుక్రవారం రెండో రోజూ దీక్ష చేపట్టారు. పట్టణంలోని కోట్ల సర్కిల్‌లోని దీక్ష శిబిరంలో ఆమె మాట్లాడారు. అవినీతి, అక్రమాలు తావు లేకుండా విధులు నిర్వర్తించామని తెలిపారు. వైసిపిలోనే కొనసాగుతున్నా మాట మాత్రమైనా చెప్పకుండా పదవి నుండి దించాలని కౌన్సిలర్లు కుట్రపన్నడం తగదన్నారు. తనకు జగన్మోహన్ రెడ్డి నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్ష విరమించబోనని తెలిపారు.

సూత్రధారులు ఎవరు : గత ఆరు నెలల నుంచి ఛైర్మన్ శాంతను పదవి నుంచి దించుతారని ప్రచారం సాగుతోంది. అప్పటి నుంచి నోరు మెదపని ఆమె దీక్ష చేపట్టడంపై చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కలెక్టర్‌కు పంపిన నేపథ్యంలో ఛైర్మన్ శాంత దీక్షకు పూనుకోవడం వెనుక బిజెపి నాయకుల హస్తమున్నట్లు పలువురు వెల్లిబుచ్చుతున్నారు. దీక్ష చేపట్టిన నేపథ్యంతో మధ్యాహ్నం వరకు ఆమె నోరు మెదపలేదు. ఎమ్మెల్యే పార్థసారథి స్క్రిప్ట్ ప్రకారమే ఛైర్మన్ శాంత మధ్యాహ్నం సమయంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లపై విమర్శలు చేసినట్లు తెలిసింది. ఆమె దీక్షకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదని సమాచారం.

రోడ్డున పడడం సమంజసం కాదు

ఆదోని చరిత్రలో రాజకీయం రోడ్డున పడిన దాఖలాలు లేవని, ఛైర్మన్ పదవి వ్యవహారంపై రాజకీయం చోటు చేసుకోవడం దురదృష్టకరమని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీక్ష శిబిరం వద్దకు వెళ్లి విరమించాలని ఛైర్మన్ శాంతకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రాజకీయ నాయకుల వ్యవహారాలు చర్చలతోనే పరిష్కరించుకోవాలని, ఇలా బజారున పడడం వల్ల న్యాయం జరగదని సూచించారు.



దీక్షలో కూర్చున్న ఛైర్మన్ శాంత

ఉపాధి ఈసీపై చర్యలు తీసుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - దేవనకొండ


ఏపీవోకు వినతి పత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు

కూలీలకు పని కల్పించకుండా, పనిచేసిన కూలీలపై దురుసుగా ప్రవర్తిస్తూ ఉద్దేశపూర్వకంగా వేతనాలు తక్కువ వేస్తున్న మండల ఉపాధి హామీ చట్టం ఈసీ పెంచలయ్యపై చర్యలు తీసుకోవాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ ఎఒ నాగమ్మ, ఉపాధి ఏపీవో రాజు నాయక్‌కు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించాల్సింది పోయి.. రెండు, మూడు వారాలైనా ఈసీ పనులు కల్పించడం లేదని, మస్టర్లు అడిగినా ఇవ్వడం లేదని తెలిపారు. వారం రోజులు పని చేస్తే రెండు రోజులకు హాజరు వేస్తూ కూలీల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'ఉచితంగా డబ్బులు తింటున్నారం'టూ దుర్భాషలాడుతూ కూలీల పట్ల దురుసుగా మాట్లాడుతుంటారని తెలిపారు. మండలంలో తెర్నేకల్ గ్రామంలో ఎక్కువ కూలీలు పనికొస్తారని, అలాంటి గ్రామంలో రెండు వారాలుగా పనులు లేవని, దానికి పూర్తి బాధ్యత ఈసీదేనని పేర్కొన్నారు. ఈసీపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వ్యకాస నాయకులు పరమేష్, బజారి, దొడ్డప్ప, సుధాకర్, రవీంద్ర పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

గ్రామంలో మౌలిక సదుపాయాలకు, అభివృద్ధి పనులు చేపట్టడానికి కట్టుబడి ఉన్నామని సర్పంచి కరివేముల సావిత్రి తెలిపారు. శుక్రవారం బెల్డోన గ్రామంలోని సచివాలయంలో సర్పంచి కరివేముల సావిత్రి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రధాన సమస్యలైన తాగునీరు, సిసి రోడ్డు నిర్మాణాలు, డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేశామన్నారు. ట్యాంకును కూడా శుభ్రం చేయించామని తెలిపారు. గ్రామంలో అంటువ్యాధులు, దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ కార్మికుల చేత పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. పేదల గృహాల వద్ద నీటి సమస్య లేకుండా నూతన పైపులైను ఏర్పాటు చేశామన్నారు. ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ మారుతి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని షరాఫ్ బజార్, కొండవీటి ప్రాంతం, మల్లారి వారి కాలనీ ఏరియాలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు. అలాగే పట్టణంలోని పార్కు రోడ్డు, హెచ్‌బిఎస్ కాలనీ, కమిటీ రోడ్డు, కర్నూలు రోడ్డులో పారిశుధ్య పనులు పరిశీలించారు.